

దరఖాస్తులకు ఆహ్వానం



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసిలో డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో అప్రంటీస్ షిప్ కోసం ఐటిఐ ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 20 నుంచి 31 వరకు www.apprenticeship. gov.in వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ ధ్రువపత్రాలు పరిశీలన నిమిత్తం నవంబరు 7న ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా వి.టి. అగ్రహారంలోని ఆర్‌టిసి జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలు, సందేహాలు నివృత్తి కోసం 08922-294906 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

యువతే లక్ష్యం

ఒడిశా ప్రాంతంలో సాగవుతున్న గంజాయి అక్కడి నుంచి ముంబై, హైదరాబాద్, కేరళ, కర్ణాటక, అస్సాం తదితర ప్రాంతాలకు పలాస, ఇచ్ఛాపురం కేంద్రాలుగా రవాణా సాగుతోంది. ప్రధానంగా పలాస రైల్వే స్టేషన్ కేంద్ర బిందువుగా ప్రయాణికుల బ్యాగుల్లో ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది. పోలీసుల తనిఖీలో సుమారు ఆరు నెలల వ్యవధిలో రైల్వే పోలీసులు, కాశీబుగ్గ పోలీసులు సుమారు 517 కేజీల గంజాయి నిల్వలు పట్టుబడడం చర్చనీయాంశమవుతోంది. లగేజీ బ్యాగులు కనిపిస్తే చాలు అందులో గంజాయి కచ్చితంగా ఉంటుందనే నమ్మకం పోలీసుల్లో ఏర్పడింది. పోలీసులు తనిఖీలు ముమ్మరం చేయడంతో అధికంగా గంజాయి రవాణాదారులు పట్టుబడుతున్నారు. పట్టుబడిన వారంతా కేవలం రోజువారి కూలీలు, యువతే ఎక్కువగా ఉంటున్నారు.

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వే పోలీసులు, కాశీబుగ్గ పోలీసు స్టేషన్ పరిధిలో సుమారు ఆరు నెలల్లో 517 కేజీల గంజాయిని పట్టుకున్నారు. గత నెలలో ఇచ్ఛాపురం, కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో 83 కిలోల గంజాయిని పట్టుకొని అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలో మే 2న 102 కేజీలు, 26 జూన్‌లో 38 కేజీలు, 5 జూలై 27 కేజీలు, 27 జూలై 40 కేజీలు, 29 జూలై 18 కేజీలు, 7 ఆగష్టు 8 కేజీలు, 15 ఆగష్టు 10 కేజీలు, 18 ఆగష్టు 32 కేజీలు, 16 సెప్టెంబరు 30 కేజీలు, 25 సెప్టెంబరు 48 కేజీలు, 27 సెప్టెంబరు 14 కేజీలు, అలాగే కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో 6 ఫిబ్రవరి 12 కేజీలు, 21 మార్చి 9 కేజీలు, 18 మార్చి 20 కేజీలు, 1మే 25 కేజీలు, 5 సెప్టెంబరు 2 కేజీలు, 25 సెప్టెంబరు 2 కేజీలు, 8 అక్టోబరు 5 కేజీలు పట్టుబడ్డాయి. ఇలా... సుమారు ఆరు నెలల వ్యవధిలో సుమారు 517 కేజీల గంజాయిని పలాస రైల్వే, కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. అలాగే గతేడాది పలాస మండలం లక్ష్మీపురం టోల్ గేటు వద్ద ఒడిశా నుంచి ఆయిల్ ట్యాంకు వస్తుండగా అనుమానంతో కాశీబుగ పోలీసులు సోదాలు చేశారు. ట్యాంకులో పెట్రోల్‌కు బదులు టన్నున్నరకు పైగా గంజాయి ఉండడంతో నివ్వెరపోయారు. కొన్నాళ్ల కిందట లక్ష్మీపురం టోలేట్ వద్ద కాశీబుగ్గ పోలీసులు ఖాళీగా వెళ్తున్న ఒడిశాకు చెందిన ఒక లగేజీ వ్యాన్ను తనిఖీ చేశారు. వ్యాన్ కింద భాగంలో చూడగా ప్రత్యేకంగా ఓ అర కనిపించింది. అది తెరిచి చూడగా అందులో 200 కిలోలకుపైగా గంజాయి పట్టుబడింది.



పట్టుబడిన గంజాయి బస్తాలు (ఫైల్)

- ఒడిశా నుంచి గంజాయి అక్రమ రవాణా
- ఆరు నెలల్లో 517 కేజీలు సీజ్
- బ్యాగ్ కనిపిస్తే తనిఖీలే...



గంజాయిని తూకం వేస్తున్న పోలీసులు (ఫైల్)

యువతపైనే ఎక్కువగా కేసుల నమోదు

గంజాయి కేసుల్లో ఎక్కువగా యువత చిక్కుకుంటున్నారు. చదువు కోవాల్సిన యువత చెడు తిరుగులకు అలవాటు పడి విలాసాల కోసం డబ్బులకు కక్కుర్తి పడి గంజాయి అక్రమ రవాణా చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటి వరకు నూటికి తొంభై శాతం కేసుల్లో యువత ఉండడమే అందుకు నిదర్శనం. గంజాయి వ్యాపారులు, గంజాయి సాగు చేస్తున్న వ్యక్తులు యువతకు మాయ మాటలు చెప్పి వాళ్లతో గంజాయి అక్రమ రవాణాకు వినియోగించడం ద్వారా యువత తమ భవిష్యత్‌ను కోల్పోతున్నారు.

బాధ్యులు ఎవరు?

తల్లిదండ్రులు తమ పిల్లలపై బాధ్యతగా ఉండాలి. పిల్లలు ఏమి చేస్తున్నారో ఎప్పటికప్పుడు పరిశీలించాలి. చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూడాలి. కానీ, తల్లిదండ్రులు తమ కుటుంబాన్ని పోషించేందుకు ఉదయం నుంచి రాత్రి వరకు వారివారి పనిలో నిమగ్నమవడంతో పిల్లలు చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారు. దీనిపై తల్లిదండ్రులు తమ కాక అయితే వాటిని నివారించేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో డ్రగ్స్‌పై అవగాహన సదస్సులు, బహిరంగ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట

ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా నుంచి పలాస కేంద్రంగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. ఈ ప్రాంతానికి చుట్టూ ఒడిశా ప్రాంతం ఉండడంతో బస్సు, రైలు, ద్విచక్ర వాహనాలపై గంజాయి రవాణా చేసేందుకు అనుకూలంగా ఉంది. దీంతో ఎక్కువగా పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో గంజాయిని ఎక్కువగా పట్టుబడుతుంది. గంజాయి అక్రమ రవాణాకు పలాస రైల్వే పోలీసులతో పాటు కాశీబుగ్గ పోలీసులు అడ్డుకట్ట వేస్తున్నారు. నిత్యం రైలు, రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేయడం, అనుమానంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘా పెట్టడం, విస్తృతంగా బ్యాగ్‌లు పరిశీలించడం, ఎప్పటికప్పుడు గంజాయి అక్రమ రవాణా జరగకుండా అడ్డుకుంటున్నారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు



గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాం. ప్రత్యేక బృందం ఏర్పాటు చేశాం. ఎక్కువగా ఒడిశా ప్రాంతం నుంచే గంజాయి వస్తున్నట్లు గుర్తించాం. ఒడిశా నుంచి వస్తున్న వాహనాలు, బస్సులను విస్తృతంగా తనిఖీ చేస్తున్నాం. రైల్వేస్టేషన్ పరిధిలో ప్రత్యేక నిఘా పెట్టాం. యువత డ్రగ్స్‌కు అలవాటు కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రయివేటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు గంజాయితో వచ్చే నష్టాలపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నాం.

\- డి.మోహనరావు, కాశీబుగ్గ సిఐ

కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం

నిర్వాసితుల కాలనీ నిర్మాణానికి చర్యలు

- జెట్టీ ఏర్పాటుకు అధ్యయన కమిటీ పరిశీలన
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం నిర్వాసితుల కాలనీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. కలెక్టరేట్‌లో కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం నిర్వాసితులతో ఎచ్చెర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, జెసితో కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొవ్వాడ అణు విద్యుత్కేంద్రానికి భూ సేకరణ పూర్తి కాగా, భూమి ఆక్రమణ కాకుండా సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి వారికి సౌకర్యాలపై కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం చీఫ్ ఇంజినీర్ ప్రసాద్ చర్చించాలన్నారు. నిధులు వచ్చిన వెంటనే రహదారులు పనులు ప్రారంభిస్తామని వివరించారు. ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మించాల్సి ఉందన్నారు. తాగునీరు, రహదారి, డ్రెయినేజీ సమస్యలు గురించి ప్రజలు చెప్పినట్లు చెప్పారు. నిర్వాసితులకు నిర్మించబోయే ఆర్అండ్ఆర్ కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్, సచివాలయాలు, ప్రాథమిక పాఠశాలు, అంగన్వాడీ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీ, సైక్లోన్ సెంటర్, బస్సు షెల్టర్, పోస్టాఫీసు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రహదారులు, దేవాలయాలు, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని యాజమాన్యం వివరించారు. ఆర్అండ్ఆర్ కాలనీలో తాగునీటి అవసరాలకు ధర్మవరం వద్ద ఉన్న పెద్ద చెరువును రిజర్వాయరు చేయడం కానీ, నాగావళి నది నుంచి పైపులైన్ ద్వారా గాని అధ్యయనం చేయించి తీసుకొస్తామని ఎమ్మెల్యే గ్రామస్తులు తాగునీటి కోసం అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. కోల్డ్ స్టోరేజ్, జెట్టీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. అణు విద్యుత్కేంద్రం వస్తే కంపెనీలు వస్తాయని తెలిపారు. ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. చెన్నయ్, బెంగళూరు నుంచి టీంల వస్తాయని, జెట్టీ ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తాయని వివరించారు. నిర్వాసితుల భూములకు సంబంధించి 21 మందికి డబ్బులు జమ చేయాలని ఎమ్మెల్యే చెప్పగా, రణస్థలం తహశీల్దార్ ఎన్.ప్రసాదరావు ఆర్‌డిఒకి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన తరువాత వేస్తామని చెప్పారు. మిగిలిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు కలెక్టర్ ఆదేశించారు. గ్రామ కంఠంలోని చెట్లకు నష్టపరిహారం అందజేయాలన్నారు. ఒక్కో ఇంటికి ఒక ఉద్యోగం అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు. ధర్మవరం, మత్స్యలేశం గ్రామాల్లో అటవీ భూమి ఉన్నట్లు తేలిందని చెప్పారు. గ్రామాలకు సంబంధించి మౌలిక సదుపాయాలే కాకుండా అదనపు సౌకర్యాలు కల్పిస్తామని అణు విద్యుత్కేంద్రం యాజమాన్యం వివరించారు. కొవ్వాడ, చినకొవ్వాడ, రామచంద్రాపురం, గూడేం గ్రామాలు ఎఫెక్ట్ అవుతున్నాయని బాధితులు తెలిపారు. ఫిషింగ్ జెట్టి, కోల్డ్ స్టోరేజ్, కేంద్రీయ విద్యాలయం, ఏర్పాటు చేయాలని నిర్వాసితులు కోరారు. ఆర్అండ్ఆర్ కాలనీని ఎంత త్వరగా నిర్మాణాలు పూర్తి అవుతాయో తక్షణమే కాలనీకి మారిపోతామని గ్రామస్తులు చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, ఆర్‌డిఒ కె.సాయిప్రత్యూష, కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం స్పెషల్ తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు, కొవ్వాడ అణు విద్యుత్కేంద్రం చీఫ్ ఇంజినీర్ ప్రసాద్, ఎచ్చెర్ల తహశీల్దార్ ఎ.సింహాచలం మత్స్యశాఖ జెడి శ్రీనివాసరావు, జి-సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రేపట్నుంచి పోలీసు అమరవీరుల స్మారకోత్సవాలు

ఎస్‌పి మహేశ్వర రెడ్డి



శ్రీకాకుళం: పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏటా నిర్వహించే పోలీసు అమర వీరుల స్మారకోత్సవాలు ఈ నెల 21 నుంచి అట్టహాసంగా ప్రారంభంకానున్నాయని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలను, త్యాగాలను కొనియాడుతూ ఈ స్మారకోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసుశాఖ సిద్ధమయ్యిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ స్మారకోత్సవాలు నిర్వహించనున్నారని తెలిపారు. పోలీసుల కీలకమైన పాత్ర, విధులు, త్యాగాలు గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావడమే ముఖ్య ఉద్దేశమని అన్నారు. 21న జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమర వీరుల స్థూపం వద్ద పోలీసు అమర వీరుల సంస్మరణ దినం ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారని చెప్పారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ముఖ్యమైన జంక్షన్లు, పబ్లిక్ ప్రదేశాల్లో అమర వీరులను స్మరిస్తూ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నామని అన్నారు. 21 నుంచి 31 వరకు ఎచ్చెర్లలోని పోలీసు కళ్యాణ మండపంలో పోలీసులు ఆయుధాలు, పరికరాలు, సాధనాలు, సాంకేతిక ఉపకరణాలతో ఓపెన్‌హౌస్ ప్రదర్శన నిర్వహించి అవగాహన చేయనున్నామని అన్నారు.

రైతు సదస్సును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- మందస

రైతాంగ సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడ ఎంబివికెలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారని, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు పిలుపునిచ్చారు. రైతు సంఘం మండల కమిటీ సమావేశం మట్ట ధర్మారావు అధ్యక్షతన స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సదస్సుకు కేరళ రాష్ట్ర మంత్రులు ఎం.బి.రాజేష్, ఎ.ఐకె.ఎస్.ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్, విద్యుత్ రంగ నిపుణులు డాక్టర్ కె.అశోక్‌రావు, ఇరిగేషన్ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొంటారని పేర్కొన్నారు. కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు రుణ విమోచన చట్టం అమలు, వ్యవసాయ రంగంలో కేరళ రాష్ట్రం అమలు చేస్తున్న రైతు అనుకూల విధానాలను వివరిస్తారని అన్నారు. దేశవ్యాప్తంగా మద్దతు ధరల చట్టం ఆవశ్యకత, విద్యుత్ రంగంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం తెస్తున్న సంస్కరణలు, వ్యవసాయ రంగంపై దాని ప్రభావం, సమగ్ర పంటల బీమా ఆవశ్యకత, రైతులు, కౌలు రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు తీసుకోవలసిన చర్యలు, ఐక్య ఉద్యమాల ప్రాధాన్యత తదితర అంశాలపై ఉపన్యసిస్తారని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లోచేసిన వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీడీ పంటను కేంద్ర ప్రభుత్వం పంటల మద్దతు ధరల జాబితాలో చేర్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టి.లక్ష్మీనారాయణ, అల్లాడ తాతయ్య, ఎన్.చిన్నవాడు, మామిడి భైరి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మోహనరావు

ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు

పాతపట్నం : పాతపట్నం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఇటీవల సవర లావణ్య ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ సంఘటనపై పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వార్డెన్ నాగేశ్వరిలు విద్యార్థిని ఆత్మహత్యపై అలసత్వం, సకాలంలో స్పందించకపోవడంతో సీతంపేట ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి శనివారం వారికి షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు తెలిపారు.

6 వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

డిఆర్ఒ అప్పారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి గత నెల 30న నోటిఫికేషన్ వెలువడిందని అన్నారు. అదే రోజు నుంచి ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఓటర్ల నమోదుకు నవంబరు 6 చివరి తేదీగా నిర్ణయించినట్టు చెప్పారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని ఓటర్ల నమోదు డ్రాఫ్టు పబ్లికేషన్ తదితర అంశాలపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వచ్చే నెల 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్ అవుతుందని, 23 నుంచి డిసెంబరు 9 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 29తో ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గడువు ముగుస్తుందని, ఈ నేపథ్యంలో సంబంధిత ఓటర్ల జాబితా రూపకల్పనపై అధికారులు దృష్టిసారించాలని అన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు ఆయా జిల్లాల పరిధిలో నియమించిన అధికారుల వద్ద గాని, ఆన్‌లైన్‌లో గాని ఫారం-19 సమర్పించవచ్చని చెప్పారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు సెకండరీ స్థాయి ఆరో తరగతికి పైబడి పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అర్హులేనని స్పష్టం చేశారు. పార్ట్‌టైమ్ విధానంలో పనిచేసే వారు అర్హులు కారని అన్నారు. ఓటు నమోదులో భాగంగా స్వీయ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత సంస్థ హెచ్ఒడి నుంచి ధ్రువపత్రం తీసుకొని సమర్పించాలన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వీటితోపాటు సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి కౌంటర్ సైన్ పత్రాలను సమర్పించాలన్నారు. కళాశాల స్థాయిల్లో పనిచేసే వారు సంబంధిత ఆర్‌జెడిల కౌంటర్ సైన్‌తో దరఖాస్తు చేయాలన్నారు. యూనివర్సిటీ స్థాయిలో పనిచేసేవారు విసి నియమించిన అర్హత గల అధికారుల నుంచి కౌంటర్ సైన్ తీసుకోవాలన్నారు. గత ఆరేళ్లలో సెకండరీ స్థాయికి మించిన ఏ విద్యాసంస్థలో అయినా మూడేళ్లకు తక్కువ లేకుండా పనిచేసిన ఉపాధ్యాయులు అర్హులన్నారు. వారంతా నవంబరు 6లోగా ఫారం-19 సమర్పించడం ద్వారా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. గతంలో ఓటు వేసిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని, పాత ఓటు చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. అలాగే ఉద్యోగం చేస్తున్న ప్రాంతంలో ఓటు వేయడానికి అవకాశం లేదని, ఓటు వేయడానికి ఆధార్ కార్డు చిరునామా పరిధిగా నిర్ణయించామన్నారు. 2024 సంవత్సరానికి ముందు గడిచిన ఆరేళ్లలోకనీసం మూడేళ్లు ఉపాధ్యాయ విధులు నిర్వహించిన వారు మాత్రమే ఓటు నమోదుకు అర్హులన్నారు. ఉపాధ్యాయ ఓటర్లు అధిక శాతంలో నమోదు అయ్యేలా సహకరించాలని ఉద్యోగ సంఘాలకు సూచించారు. సమావేశంలో డిఇఒ ఎస్.తిరుమల చైతన్య, ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి కె.తవిటినాయుడు, సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్ఒ అప్పారావు

విద్యార్థుల ఫీజులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదో సెమిస్టరీ చదువుతున్న విద్యార్థులకు చెందిన కళాశాల కోర్సు ఫీజులు కట్టనిదే పరీక్ష ఫీజు చెల్లించడానికి వీలులేదని ప్రిన్సిపాల్ తీసుకున్న నిబంధనలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ నాయకులు ఉర్జాన దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో ఐదో సెమిస్టరీ చదువుతున్న విద్యార్థులకు జెవిడి పథకం ఆలస్యం కావడంతో ద్వితీయ సంవత్సరం ఫీజులు చెల్లించుకోలేకపోయారని అన్నారు. దీనిని సాకుగా చూపి కళాశాల ప్రిన్సిపాల్ ఫీజులు కట్టమని విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదన్నారు. ఇదే విషయమై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మతో సంప్రదించగా, జెవిడి పథకాలతో సంబంధం లేదని, ఫీజులు తప్పనిసరిగా చెల్లించాలని స్పష్టం చేశారన్నారు. స్పెషల్ ఫీజులు ఎందుకు వసూళ్లు చేస్తున్నారని ప్రశ్నించగా... విద్యాశాఖ కమిషనర్ నిర్ణయం మేరకు వసూళ్లు చేస్తున్నామని ప్రిన్సిపాల్ చెప్పారని ఆర్‌డిఒకు వివరించారు. ఆర్‌డిఒ స్పందించి ప్రిన్సిపాల్‌తో విద్యార్థులతో కలిసి ముఖాముఖి మాట్లాడారు. సామరస్యపూర్వకంగా చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్.రవి, బి.తరుణ, ఆర్.మహేష్, డి.ఉమామహేష్, ఎస్.గిరిధర్ పాల్గొన్నారు.



ఆర్‌డిఒతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బాబు మాటలకు అర్థాలే వేరు!



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

సంపద సృష్టిస్తా.. సృష్టించిన సంపదను పేదలకు పంచుతా.. అని పదే పదే చంద్రబాబు చెప్తుంటే నిజమే కాబోలు అని అంతా అనుకున్నారు. సృష్టించిన సంపదతో మాకేవో కొత్త పథకాలు వస్తాయని పేదలంతా ఎదురుచూడటం మొదలు పెట్టారు. సంపద సృష్టించడానికి బాబు వేసిన పథకం చూసి జనం నోరెల్లబెడుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రయివేట్ మద్యం పాలసీ ప్రభుత్వానికి దరఖాస్తులు రూపంలోనే సిరులు కురిపించింది. రాష్ట్రానికి నాలుగు పరిశ్రమలు తెచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా సంపద సృష్టిస్తారు అనుకుంటే... కొత్త మద్యం విధానం ద్వారా జనం నుంచి వచ్చిన డబ్బులతో ఖజానాను నింపుకునే ప్రయత్నం చేశారు. మద్యం దుకాణాలకు దరఖాస్తుల రూపంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.18 కోట్లు రాగా, ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే రూ.93 కోట్లు ఆదాయం వచ్చింది. లాటరీ ద్వారా 158 మంది దుకాణాలు దక్కించుకోగా, 4,513 మంది డబ్బులు పోగొట్టుకుని ఉసూరుమన్నారు. అప్లికేషన్లతో పాటు లైసెన్స్ ఫీజు రూపంలోనూ ప్రభుత్వ ఖజానాకు భారీగా డబ్బులు సమకూరనున్నాయి. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిపోయిందంటూ పదే పదే ఆందోళన వ్యక్తం చేసిన బాబుకు మద్యం రూపంలో భారీ కాసులు కురిపించింది. మద్యం పాలసీ మారినా రాబడి, సరుకు నాణ్యత విషయంలో గత వైసిపి ప్రభుత్వానికి, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వానికి పెద్దగా తేడా ఏమీ కనిపించడం లేదు. గత ప్రభుత్వానికి ప్రతినెలా ఆదాయం సమకూరేది. టిడిపి కూటమి ప్రభుత్వంలో ప్రతి నాలుగు నెలకొకసారి లైసెన్స్ రూపంలో వందల కోట్ల రూపాయాల ఆదాయం సమకూరనుంది. కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా పాత సరుకునే ప్రభుత్వం అంటగడుతోందంటూ మందుబాబులు వాపోతున్నారు. తమకిచ్చిన హామీని బాబు నిలబెట్టుకోలేదంటూ తెగ బాధ పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రూ.99లకే నాణ్యమైన మద్యం అందిస్తామని కూటమి ప్రభుత్వం హామి ఇచ్చినా అది అమలుకు నోచుకోలేదు.

మద్యం ద్వారా ఒక్క అప్లికేషన్ల రూపంలోనే రాష్ట్ర ఖజానాకు రూ.1740 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్‌శాఖ ప్రకటించింది. మద్యం షాపులకు లైసెన్స్ ఫీజు రూపంలో వేల కోట్ల ఆదాయం వచ్చి చేరింది. సూపర్ సిక్స్, సంక్షేమ పథకాలకు డబ్బులు లేవంటూ చంద్రబాబు ఇప్పటివరకు చెప్పినా ప్రజలు కొంత వరకు విశ్వసించారు. మద్యం ద్వారా భారీగా ఆదాయం సమకూరిన తర్వాత కూడా అవే మాటలు చెప్తే ఎన్నికల హామీలను ఎగ్గొట్టడానికేనని ప్రజలు భావించే అవకాశాలు లేకపోలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని జనం ఆశగా ఎదురుచూస్తుంటే... అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలివ్వని కొత్త రకం సూపర్ సిక్స్‌లను తెరపైకి తెస్తోంది. ఇంటికో ఎంటర్‌ప్రైన్యూర్, మండలానికో ఎంఎస్ఎంఇ పార్కు వంటి కొత్త నినాదాలతో ఎన్నికల హామీల నుంచి ప్రజలను దృష్టి మరలించే ప్రయత్నాలు సాగిస్తోంది.

ఇసుక అక్రమ తవ్వకాలు, మద్యం పాలసీలో ప్రజాప్రతినిధుల పేర్లు వినిపిస్తుండటంతో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలను క్లాస్ పీకేందుకు చంద్రబాబు అందరినీ అమరావతికి పిలిచారు. ప్రజాప్రతినిధుల వ్యవహారంపై చంద్రబాబు రకరకాల రూపాల్లో సమాచారం సేకరించినట్లు తెలిసింది. ఇసుక, మద్యం విషయంలో ఎవరు వేలు పెట్టొద్దని నేతలను హెచ్చరించినట్లు సమాచారం. అధినేత చెప్పిన హితోక్తులు ఎంత మంది చెవికెక్కించుకుంటారో? వేచి చూడాల్సిందే. ఇసుక అక్రమ తవ్వకాల విషయంలో ఒకరిద్దరు కూటమి ఎమ్మెల్యేల తప్ప అందరి భాగస్వామ్యం ఉందనేది వేరే చెప్పనక్కర్లేదు. మద్యం దుకాణాలను దక్కించుకునే విషయంలోనూ పలువరి నేతలు పాత్ర ఉందనేది దరఖాస్తుల దగ్గర నుంచి లాటరీ వరకు జరిగిన ప్రక్రియ చూస్తే తేటతెల్లమవుతుంది. ఎన్నికల్లో ఖర్చు పెట్టిన డబ్బును తిరిగి రాబట్టుకోవాలనే ధ్యాసతో ఉన్న నేతలకు చంద్రబాబు చెప్పిన ప్రవచనాలను ఎంత మంది పాటిస్తారో చూడాలి. మద్యం, ఇసుక అక్రమ తవ్వకాల చిట్టాను సేకరించిన బాబు ఎమ్మెల్యేల ముందు ఉంచి దీనికి ఏం సమాధానం చెప్తారో? అడిగితే వారి సంగతి తెలిసేది. అలా కాకుండా అందరితో సమావేశం నిర్వహించి మీరు అది చేయొద్దు, అందులో జోక్యం వద్దు అంటే ఏం మార్పు వస్తుంది? చంద్రబాబు తన ఎమ్మెల్యేలకు ఎంత గట్టిగా హెచ్చరిస్తున్నారో, బాబు చెబుతున్నా ఎమ్మెల్యేలు మారకపోతే ఆయన మాత్రం ఏమి చేయగలరు అని అని జనం అనుకోవడానికి తప్ప ఇటువంటి సమావేశాలతో ఏం మార్పు వస్తుంది, ఏం ప్రయోజనం సమకూరుతుంది? ఇటువంటి ఉత్తుతి సమావేశాలు కాకుండా తప్పు చేసిన ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందనే విషయం బాబు గుర్తించాలి.

జాబ్‌కార్డుల మంజూరుపై ప్రత్యేక దృష్టి

శ్రీకాకుళం అర్బన్ : జాబ్‌కార్డు మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించాలని, అర్హత ఉన్న వారికి జాబ్ కార్డు మంజురు కాలేదని ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఉపాధి హామీ అమలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం 18 ఏళ్లు నిండినవారు రూరల్, అర్బన్‌లో ఎంతమంది ఉన్నారు, అలాగే ఛానల్ పనుల నిర్వహణపై ఆరా తీశారు. మండలాల వారీగా మంజూరు చేసిన జాబ్ కార్డులు, నిర్దేశిత లక్ష్యాలు సాధించిన ప్రగతిపై ఆరా తీశారు. గ్రామసభలు నిర్వహించి జాబ్ కార్డులపై రివ్యూ నిర్వహించాలన్నారు. జాబ్‌కార్డులు మంజురులో ఫిర్యాదులు వస్తే సంబంధిత ఎపిఒపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొండలపై పడిన వర్షపు నీరు నిలువ చేయడానికి చేపట్టిన పనులపై ఆరా తీశారు. మెళియాపుట్టి, కంచిలి, ఎల్ఎన్‌పేట, ఇచ్ఛాపురం, పొందూరు, వజ్రపుకొత్తూరు ఎపిఒలు చేపట్టిన పనులను కలెక్టర్‌కు వివరించారు. వంశధార, బహుదా నదులకు సంబందించిన పెద్ద కాలువ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వంశధార, బహుదా, నాగావళి ఓపెన్ హెడ్ ఛానల్స్‌కి నీరు వెళ్లేందుకు వెజ్ రిలేటెడ్ వర్క్స్‌కి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. కేనాల్ బడ్లపై, పాఠశాల ఆవరణలో, ప్రభుత్వం కార్యాలయాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు.

రైల్వే సమస్యలపై కేంద్రమంత్రికి వినతి



రామ్మోహన్ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

కోటబొమ్మాళి: మండలం తిలారు రైల్వేస్టేషన్‌లో పలు సమస్యలు న్యాయని మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు తెలుపగా ఈ విషయాన్ని కేంద్ర విమానాయ శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కలిసి చెప్పాలని మంత్రి సూచించటంతో ఆయన రామ్మోహన్ నాయుడుకు కలిసి బరంపూర్ టు విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు, ప్రశాంతి రైలు తిలారు స్టేషన్‌లో ఆపాలని, అలాగే పేటపాడు నుంచి గవరమ్మపేట వరకు రైలు ట్రాక్ పక్కనుంచి సిసిరోడ్డు నిర్మాణం చేయాలని, తిలారు పెద్ద చెరువు ఇటీవల గండి పడిందని, దానిని అభివృద్ధి చేయాలని రామకృష్ణ వివరించారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలో అధికారులు రైల్వేస్టేషన్, దానికి సంబంధించిన అంశాలను పరిశీలించాలని సూచించారు.



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

చేప పిల్లల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మత్స్యకార సహకార సంఘాల పరిధిలో ఉన్న చెరువుల్లో చేపల పెంపకానికి అవసరమైన చేపపిల్లలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు పంపిణీ చేశారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో సహకార సంఘాలకు వీటిని అందజేశారు. 40 శాతం సబ్సిడీపై ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా వీటిని అందజేశారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల్లో మత్స్యశాఖ ద్వారా స్వదేశీ మత్స్యకార సహకార సంఘాలకు లీజుకిచ్చి వాటిలో చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మత్స్యశాఖ జెడి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 183 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఉన్నట్లు గుర్తించి వాటిలో చేపల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఎడి సత్యనారాయణ, రణస్థలం తహశీల్దార్ ప్రసాద్, సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



సిఎంకు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సిఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు వీలుగా నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. ఉండవల్లిలోని టిడిపి జాతీయ కార్యాలయంలో సిఎం చంద్రబాబును శనివారం కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించారు. గార మండలం బందరువానిపేట, శ్రీకాకుళం మండలం పి.జి.పేటలో ఫిష్ ల్యాండింగ్ జెట్టీ నిర్మాణం, నాగావళి నది కొత్త వంతెన వద్ద కుడివైపు రక్షణగోడ నిర్మాణం, వంశధార నది కళింగపట్నం వద్ద సముద్రంలో కలిసే దగ్గర గ్రోయిన్, దిశ మార్పు కోసం రక్షణ గోడ నిర్మాణం, కళింగపట్నం బీచ్ అభివృద్ధి, నాగావళి నది పి.జి.పేట వద్ద కోతను నివారించకుండా రక్షణ గోడ నిర్మాణం చేపట్టేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. దీనిపై సిఎం స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీనిచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

సుజలధారను పునరుద్ధరించాలి

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంతంలోని కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. విజయవాడలోని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణకాంత్‌ను ఆయన కార్యాలయంలో శనివారం కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారానికి, వజ్రపుకొత్తూరు మండలంలోని పూడిలంకకు బ్రిడ్జి నిర్మించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధుల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో గతంలో టిడిపి ప్రభుత్వం ఎన్‌టిఆర్ సుజలధార పేరిట శుద్ధజలాన్ని అందించేదని చెప్పారు. అయితే తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆ పథకానికి తూట్లు పొడవడంతో వ్యాధి తీవ్రత మరింత పెరిగిందని, మళ్లీ వాటిని పూర్తిస్థాయిలో పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి 8 ఎంఎల్‌టి తాగునీరు అవసరమని, ఆ తాగునీటిని ఉద్దానం రక్షిత పథకం నుంచి అందించాలని విజ్ఞప్తి చేశారు. ఏటా ట్యాంకులతో తాగునీటిని సరఫరా చేసే బదులు ఆ పథకం నుంచి నీరందిస్తే మున్సిపాలిటీ అందుకు సంబంధించి పంచాయతీ రాజ్ శాఖకు పైకం చెల్లిస్తుందన్నారు. దీనిపై కమిషనర్ సాను కూలంగా స్పందించి, త్వరలో పరిష్కరిస్తామని చెప్పారని ఎమ్మెల్యే తెలిపారు.



దీక్షలో పాల్గొన్న విశ్రాంత బెంతు ఒరియా ఉద్యోగులు

విశ్రాంత ఉద్యోగుల సంఘీభావం

ప్రజాశక్తి- కవిటి

తమ సమస్యల పరిష్కారానికి కవిటి బస్టాండ్ వద్ద రిలే నిరాహారదీక్షలు కొనసాగిస్తున్న బెంతు ఒరియాలకు అప్పట్లో తరగతి ధ్రువీకరణ పత్రాలు ఉండడంతో ఉద్యోగం పొంది ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్న కుసుంపురానికి చెందిన మేగనాథ్ బిసాయి (విశ్రాంత నాబార్డు ఎజిఎం), గుణనిధి దొలాయి శనివారం దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంతు ఒరియాలు 298 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వాలు స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. ముఖ్యంగా తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ప్రస్తుత తరం తమ భవిష్యత్తుని కొల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి బెంతు ఒరియాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బెంతు ఒరియాల యూత్ అధ్యక్షుడు సుమన్ బిసాయి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డికవీధిలో అన్నదానం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని రెడ్డిక వీధిలోని విజయదుర్గమ్మ ఆలయ ఆవరణలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. యువజన సంఘం ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ



పొందూరు : విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

పాతపట్నం : మండలంలోని లాభర, బొమ్మిక ఆశ్రమ పాఠశాలలను స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. భోజన సదుపాయాలు, పడుకునే గదులు, మౌలిక సదుపాయాలపై నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

టెక్కలి : చదువుల నిమిత్తం దూరప్రాంతాల నుంచి వచ్చి వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు వార్డెన్లకు సూచించారు. పట్టణంలోని సాంఘీక సంక్షేమశాఖ, గిరిజన బాలుర వసతిగృహాలను సందర్శించారు.

సోంపేట : మండలంలోని రాజాం కస్తూరి పాఠశాలను



సోంపేట : భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి కిశోర్‌బాబు

సోంపేట ఆరో అదనపు జిల్లా కిశోర్‌బాబు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆహారం, మరుగుదొడ్ల నిర్వహణ, నీటి సదుపాయం అంశాలను గురించి అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్వో కాంతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొందూరు: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. మండలంలోని వావిలపల్లిపేట వద్ద గల మోడల్ స్కూల్‌ను సందర్శించారు. అనంతరం రాపాక కూడలి వద్ద గల జ్యోతిభా పూలే రెసిడెన్సియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించారు. ఈమెతో పాటు న్యాయవాదులు అశోక్, రాము, తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి : భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న జడ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సాగునీరు విడుదలకు చర్యలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఏటా నారాయణపురం ఆయకట్టుకు సాగునీరు అందక ఎచ్చెర్ల మండలంలోని పలు గ్రామాల్లో పంటలు ఎండి పోతున్నాయని, గుర్రపు డెక్కను తొలగించి సాగునీరు శివారు భూములకు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఎచ్చెర్ల నడికుదుటి ఈశ్వరరావు కలెక్టర్‌ను కోరారు. కలెక్టరేట్‌లో ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టరేట్‌లోని ఎచ్చెర్ల మండలానికి సాగునీరు, నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులు, ఆర్‌అండ్‌బి రహదారుల పరిస్థితిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నారాయణపురం ఆనకట్ట నుంచి ఎడమ కాలువ ద్వారా అందాల్సిన సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై క్షేత్రస్థాయిలో నీటిపారుదలశాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుర్రపుడెక్క, సిల్ట్ ఉండడంతో సాగునీరు రావడం లేదని రైతులు ప్రస్తావించడంతో సమస్యపై అధికారులతో చర్చించారు. తాత్కాలిక పనులు చేపట్టి రైతుల సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. లస్కర్లు కాలువల్లో నీట పారుదలకు ఉన్న అడ్డంకులను అధికారులకు చెపుతున్నా... నిధుల సమస్య ఉండడంతో పనులు చేపట్టలేక పోతున్నామని అన్నారు. ఎస్ఇ గతంలో చెప్పారని వివరించడంతో అందుకు అవసరమైన నిధులు సమకూర్చడానికి ఉన్నతస్థాయిలో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. రహదారులు, భవనాలశాఖ ఆధ్వర్యాన ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో రోడ్లను మరమ్మతులు చేపట్టాలన్నారు. అందుకు తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఎస్ఇ జాన్ సుధాకర్‌ను ఆదేశించారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఉపాధి నిధులు వినియోగించాలని పంచాయతీరాజ్‌శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డిఒ కె.సాయిప్రత్యూష, ఇరిగేషన్ ఎస్ఇ సుధాకర్, పంచాయతీ రాజ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య'కు దరఖాస్తుల స్వీకరణ

ఆమదాలవలస: 2024 - 25 ఏడాదికి మిషన్ వాత్సల్య పథకంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసిడిఎస్ పిఒ ఎస్.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుపేద, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు విద్య, వైద్య అభివృద్ధి కోసం నెలకు రూ.4 వేలు ఆర్థికసాయం అందించే పథకమని తెలిపారు. ఈ నెల 25న దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అని, మార్చి 2025 నాటికి 18 ఏళ్లలోపు తల్లి, తండ్రి కోల్పోయిన పిల్లలు, ఇతర కుటుంబాలలో నివసిస్తున్న అనాథ పిల్లలు ఈ పథకానికి అర్హులని తెలిపారు. తల్లి, తండ్రి కేన్సర్, ఎయిడ్స్, డయాలసిస్ వంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు ఎన్‌టిఆర్ ఆరోగ్యసేవ, ప్రభుత్వ పథకాలు పొందని వారై ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించకూడదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించబడునని తెలిపారు.

విద్యార్థి దశ కీలకం

ఉన్నత విద్యాశాఖ రీజనల్ జెడి శోభారాణి



మాట్లాడుతున్న ఆర్‌జెడి శోభారాణి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి వ్యక్తి జీవితంలో బాల్యం, కౌమార దశ ఎంతో కీలకమైనదని, ఈ దశల్లో జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఉన్నత విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి సూచించారు. కళాశాలలో కొత్త, పాత విద్యార్థుల కలయిక స్నేహపూరిత వాతావరణంలో ఉండాలన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీనియర్లు కొత్తగా కాలేజీకి వచ్చే విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలన్నారు. కళాశాలను అభివృద్ధి పథంలో పయనించేటట్లు తోడ్పడాలన్నారు. ఆర్ట్స్ కళాశాలకు గత చరిత్ర ఎంతో ఉందని అన్నారు. ఎంతో మంది ఐఎఎస్, ఐపిఎస్, గ్రూప్ అధికారుల, ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలను తీర్చిదిద్దిన చరిత్ర ఉందన్నారు. వారి అడుగు జాడల్లో ఉన్నత స్థితినిఅందుకోవాలన్నారు. కళాశాల కొద్ది రోజుల్లో నాక్ గుర్తింపుకు వెళ్తుందన్నారు. మంచి స్థానాన్ని పొందడానికి అధ్యాపకులు శ్రమించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు డిగ్రీలో చక్కగా చదివితే మంచి జీవితానికి పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ రోణంకి హరిత, స్టూడెంట్ యూనియన్ కో-ఆర్డినేటర్ ప్రదీప్, ఎన్‌సిసి అధికారి వై.పోలినాయుడు, కళాశాల పూర్వ విద్యార్థి చిలక విజయభాస్కర్ పాల్గొన్నారు.

తుపాను షెల్టర్ల పరిశీలన



పోలాకి : సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీధర్ రాజు రామన్

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో తీర ప్రాంత గ్రామాల్లోని తుపాను షెల్టర్లు ఏవైనా పాడైతే వాటిని వెంటనే మరమ్మతులు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి శ్రీధర్‌రాజు రామన్ ఆదేశించారు. మండలంలోని అక్కువరం, డి.ఎల్.పురం గ్రామాల్లోని తుపాను షెల్టర్ల స్థితిగతులను శనివారం పరిశీలించారు. మరమ్మతులకు కావాల్సిన మెటీరియల్‌కు ఎస్టిమేట్స్ వేసి కలెక్టరేట్‌కు పంపించాలని సూచించారు. వాటిని స్పెషల్ గ్రాంట్స్ నుంచి నిదులు విడుదలవుతాయని, పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. ఈ నెల 22న నుంచి తుపాను ప్రభావం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తీర ప్రాంత ప్రజలకు అప్రమత్తం చేయాలని సూచించారు. ముందు మండల పరిషత్ కార్యాలయానికి సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రవికుమార్, సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ విజయకుమార్, జూనియర్ అసిస్టెంట్ రమ, కొత్తరేవు కార్యదర్శి రత్నకుమార్ పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు : పరిశీలిస్తున్న తహశీల్దార్ సీతారామయ్య

వజ్రపుకొత్తూరు : తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలలోని మెట్టూరు, గుణుపల్లి, చీపురుపల్లి, బాతుపురం, బైపల్లి గ్రామాల్లో శనివారం తహశీల్దార్ డి.వి.సీతారామయ్య రక్షిత తుపాను భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా భవనాల్లోని సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యుత్, తాగునీరు సౌకర్యం కచ్చితంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అనంతరం తుపానుపై మత్స్యకారులను అప్రమత్తం చేశారు. విఆర్‌ఒలు వెంకటరావు, ఇందిరాప్రియదర్శిని పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్‌కు వితరణ

ప్రజాశక్తి- పలాస

ఇటీవల విజయవాడలో వరదల బాధితులకు తమవంతు సాయంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ద్వారా పలువురు తమ సాయాన్ని సిఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. శనివారం రాజధానిలో ఆ చెక్కులను ఎమ్మెల్యే శిరీష అందజేశారు. పలాసలోని మదర్ థెరిసా విద్యాలయం ప్రిన్సిపాల్ వజ్జ గంగాభవానీ రూ.లక్ష, సాయిశిరీష కాలేజ్ ప్రిన్సిపాల్ రూ.50 వేలు, లయన్స్ మెంబర్స్ క్లబ్ అధ్యక్షుడు రూ.80 వేలు, ఉద్దానం విశ్రాంత ఆర్మీ అసోసియేషన్ రూ. 21 వేలు అందించినట్లు వివరించారు.

కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి- పొందూరు

జిల్లాలో అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ డిఇఒ ఆర్.విజయకుమారి తెలిపారు. మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుతో పాటు, పాఠశాల భవనాల ఆధునీకరణకు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం వంటివి కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తున్నట్లు తెలి పారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాటు చేసి ఇంటి వద్ద విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించేలా తల్లిదండ్రు లకు సూచించాలని హెచ్ఎం బల్ల కంటయ్యకు సూచిం చారు. అనంతరం రికార్డులు, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

టెక్కలి : కేరళ రాష్ట్రం శబరిమళ ఆయ్యప్పస్వామి దర్శనానికి సంబంధించి టెక్కలి ఆర్‌టిసి డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నామని డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శబరిమళకు ప్రత్యేక టూర్ ప్యాకేజీలతో 5,7,9,11 రోజులు వంటి ప్యాకేజీ ఉంటుందని అన్నారు. యాత్రికులు ఆర్‌టిసి డిపోలోని ఉద్యోగులను సంప్రదించాలన్నారు.

విద్యార్థుల ప్రతిభ

టెక్కలి : మండలంలోని రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని ప్రతిభకనబరిచారు. ఈ మేరకు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.భారతి అభినందించారు. కోనసీమ జిల్లా కాట్రేనికోన పట్టణంలో క్రియేటివిటీ ఆర్ట్స్ ఆకాడమీ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో పదో తరగతి చదువుతున్న సి.హెచ్.గౌరి, 9వ తరగతి చదువుతున్న కల్లూరి జయరాంలు పాల్గొని ప్రతిభ కనబర్చారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

నిర్మాణ పనుల బకాయిలు చెల్లిస్తాం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

2014 - 19 మధ్య టిడిపి ప్రభుత్వ పాలనలో నిర్మాణాలు పూర్తి చేసి బిల్లుల అందని ప్రతిఒక్కరి బకాయిలను త్వరలో చెల్లిస్తామని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని పురుషోత్తపురం, రావివలస, నందికొండ, గోనెపాడు, మతలబుపేట, తెలికిపెంట గ్రామాల్లో మరణించిన టిడిపి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మతలబుపేటలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో మాజీ సిఎం జగన్ రెడ్డి కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. నీరు చెట్టు, ఉపాధి హామీ ప్రత్యేక ప్యాకేజీ కింద చేపట్టిన అభివృద్ధి పనులకు ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికలో పాఠశాల గదులు, వంటశాలలు, అంగన్వాడీ భవనాలు తదితర నిర్మాణ పనులకు బిల్లులు చెల్లించాల్సి ఉందనిసిఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. 2014 - 19 టిడిపి ప్రభుత్వ పాలనలో నిర్మాణాలు జరిగిన పక్కా గృహాలకు బిల్లుల బకాయిలను చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్య నారాయణ, తెలుగు యువత అధ్యక్షులు తాడేల రాజారావు, ఐ టిడిపి అధ్యక్షులు నూక ప్రభాకర్, టిడిపి నాయకులు కిల్లి సిద్ధార్థ, నందివాడ గోవిందరావు, నూక కోటేశ్వరరావు, బిర్లంగి నాగేశ్వరరావు, దవల సింహాచలం పాల్గొన్నారు.

అండగా ఉంటాం

శ్రీకాకుళం రూరల్: విద్యతోనే ఉన్నత శిఖరాలను అందుకోగలమని, అధైర్య పడవద్దని అండగా ఉంటామని ఓ నిరుపేద విద్యార్థికి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షులు గొండు స్వాతి భరోసా కల్పించారు. విశాఖ ఎ కాలనీలో ఉన్న టిడిపి కార్యాలయంలో రొంగలి శివాజీ అనే ఎంబిబిఎస్ విద్యార్థికి రూ.లక్షా 50 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డుకాదని, పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం సీతంపేటకు చెందిన శివాజీకి శ్రీకాకుళం జిల్లా ఏకలవ్య బృందం నుంచి రూ.44 వేలు, జస్ట్ డూ ఇట్ బృందం రూ. లక్షా 6వేలు అందించారు. ఈ మొత్తం రూ. లక్షా 50 వేలు శనివారం ఎంబిబిఎస్ విద్యార్థి శివాజీకి అందజేశారు. గొర్లె మురళి, గేదెల మోహనరావు, గేదెల గోవిందరావు, రెడ్డి గిరిజా శంకర్, మాజీ సర్పంచ్ ఎండు చిన్నారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

వంద రోజుల్లో గృహాలు పూర్తి

పలాస: వంద రోజుల్లో ప్రభుత్వ గృహాలను పూర్తి చేయాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి, జిల్లా భూగర్భ జల వనరులశాఖ డెప్యూటీ డైరెక్టర్ బి.రమణమూర్తి, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. మండలంలోని రామకృష్ణపురం, తర్లకోట, బొడ్డపాడు లేఅవుట్లను శనివారం పరిశీలించారు. అనంతరం పలాస మున్సిపల్ కార్యాలయంలో శనివారం ప్రభుత్వ గృహ నిర్మాణంపై అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామకృష్ణాపురం, బొడ్డపాడు, తర్లాకోట గ్రామాల వద్ద నిర్మిస్తున్న ప్రభుత్వ గృహాలు మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కోరారు. తరువాత కట్టే గృహాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి రుణాలు ఇవ్వదని.. లబ్ధిదారులే కట్టుకోవాల్సి ఉందన్నారు. దీనికోసం మున్సిపాలిటీలో వార్డుల వారిగా లబ్ధిదారుల వివరాలు సేకరించి వారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. మొత్తం 1955 గృహాలు నిర్మించాల్సి ఉండగా, 310 గృహాలు చివరి దశలో ఉన్నాయని అన్నారు. మరో 207 గృహాలు లెంటిల్ లెవిల్లో ఉన్నాయన్నారు. వాటిని పూర్తి చేయడానికి లబ్ధిదారులకు అధికారులు, సిబ్బంది సహకారాన్ని అందించాలన్నారు. వారికి కావాల్సిన ఉచిత ఇసుక సాంకేతి పరిజ్ఞానాన్ని అందిచాలన్నారు. జిల్లాలో భారీ ప్రభుత్వ లేఅవుట్లలో నిర్మాణాలు వేగవంతం చేయడానికి ప్రత్యేక అధికారులను నియమించారని అన్నారు. నిరంతరం పర్యవేక్షణతో వీటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు ప్రభుత్వ లేఅవుట్ల సముదాయాలను అధికారుల బృందం పరిశీలించింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, హౌసింగ్ ఎఇ రాజమోహన్ పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

పరిశ్రమలో కార్మికుడు మృతి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విజయనగరం జిల్లా బొండపల్లి మండలం బి.రాజేరు గ్రామానికి చెందిన పూడి చిన్నం నాయుడు (35) పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ ఎస్ఇజెడ్‌లో గత ఎనిమిదేళ్లగా మెయింటినెన్స్ ఫిట్టర్‌గా ఆర్ఎం స్ట్రాంగ్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నారు. ఎప్పటిలాగే డ్యూటీలో ఉండగా సుమారు 2.30 గంటల ప్రాంతంలో కార్మికుడు కుప్పకూలిపోవడంతో విజయనగరం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నంనాయుడు మరణించాడని వైద్యులు నిర్ధారణ చేశారు. బంధువులు తిరిగి కంపెనీకి మృతదేహం తీసుకువస్తుండగా పైడిభీమవరం ముందు పరిశ్రమ సమీపంలో పోలీసులు అంబులెన్స్ ఆపి శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. అంబులెన్స్‌లో ఉన్న కార్మికుల బంధువులను కూడా అంబులెన్స్ నుంచి పోలీసులు దించేసి మృతదేహాన్ని తీసుకు వెళ్ళిపోయారని, మృతదేహం ఇవ్వాలని బంధువులు కోరారు. అయితే విద్యుత్ షాక్‌తో చిన్నంనాయుడు మరణించి ఉంటాడని, తగిన న్యాయం చేయాలని పైడిభీమవరం సిస్కో పోలీస్ స్టేషన్ వద్ద డిమాండ్ చేస్తు బంధువులు ధర్నా చేపట్టారు.

వివాహితపై అత్యాచారయత్నం

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని పెద్దబానాపురం పంచాయతీ పెద్దినాయుడుపేటకు చెందిన కొండాల మహేష్ తన ఆటో తీసుకొని శనివారం వేకువజామున 3 గంటల సమయంలో కోటబొమ్మాళి మండలం శ్రీపురానికి కూరగాయల కోసం వెళ్లాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన టి.భువనేశ్వర్ మహేష్ ఇంట్లోకి వెళ్లి ఆయన భార్యపై అత్యాచారయత్నానికి ప్రయత్నిం చాడు. ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో చుట్టుపక్కల చేరుకున్నారు. దీనిని గమనించిన భువనేశ్వర్ పరారయ్యాడు. దీనిపై ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ షేక్ మహమ్మద్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తెలతాడు చోరీ

మెళియాపుట్టి : మండలంలోని టకోయిలో పల్లి కనకమ్మకు చెందిన పుస్తెల తోడును గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం చోరీ చేశాడు. సాయంత్రం సమయంలో వంట చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి దూరి కరెంట్ మెయిన్ స్విచాఫ్ చేశారు. అనంతరం ఆమె మెడలోని మూడున్నర తులాల పుస్తెలతాడు తెంపుకొని పారిపోయాడు. ఆమె కేక వేయడంతో స్థానికులతో కలిసి వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో ఆమె భర్త కృష్ణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పి.రమేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సురేష్ అరెస్టు

బూర్జ: ఆముదాలవలస సిఐ ఈశ్వర్‌ప్రసాద్‌పై 2022లో అనుచితంగా ప్రవర్తించిన కేసులో ఇండిపెండెంట్ అభ్యర్థి సనపల సురేష్‌ను మండలంలోని గుత్తావళిలో శనివారం శ్రీకాకుళం పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం శ్రీకాకుళం కోర్టులో హాజరుపరిచ్చారు. కారులో వెళ్తున్న సురేష్ మాట్లాడుతూ మాట్లాడుతూ తనను అరెస్టు చేయడం కేవలం వ్యక్తిగత కక్షసాధింపు చర్య అని వాపోయారు. ఇటీవల తాను ఆముదాలవలస నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై తాను అడ్డుకోవడంతో తను ఈ విధంగా వేధిస్తున్నారని తెలిపారు. ఇటీవల తనపై బలగ కూడలి వద్ద దాడికీ పాల్పడ్డారని ఆరోపించారు అనారోగ్యంతో ఉన్న తనను కేవలం వ్యక్తిగత కక్షలతోనే అరెస్టు చేశారని, ఇంది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒకవేళ తనకు ప్రాణహాని జరిగితే అందుకు ఎమ్మెల్యే కూన రవికుమార్ బాధ్యులని పేర్కొన్నారు.

నేడు హిందీ మంచ్ సమావేశం

రణస్థలం రూరల్: శ్రీకాకుళం నగరంలోని 80 ఫీట్ రోడ్డులో గల బికెఎస్ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం 11 గంటలకు హిందీ మంచ్ సంస్థ జిల్లాశాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు దొంతం పార్వతీశం, రొంపివలస రామారావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఎల్‌పి సెట్ నోటిఫికేషన్, డిఎస్‌సిలో హిందీ పోస్టుల పెంపు తదితర సమస్యలపై చర్చతో పాటు, మంచ్ జిల్లాశాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జరుగు తుందని తెలిపారు. హిందీ పండితులు, ప్రచారకులు, విద్యార్థులు, నిరుద్యోగులు, హిందీ భాషాభిమానులందరూ హాజరు కావాలని కోరారు.

టొయోటా గ్లాంజా కొత్త వెర్షన్ విడుదల

శ్రీకాకుళం: టొయోటా కిర్లోస్కర్ మోటార్ టొయోటా గ్లాంజా 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'ని పరిచయం చేస్తున్నట్లు పెద్దపాడు టొయోటా షో రూమ్ కిర్లోస్కర్ మోటార్ సేల్స్, సర్వీస్, యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్‌లు ఇప్పుడు ప్రత్యేకమైన డీలర్, ఫిట్టెడ్ టొయోటా జెన్యూన్ యాక్సెసరీ (టిజిఎ) ప్యాకేజీలను ఆస్వాదించ వచ్చు నన్నారు. అధునాతన సాంకేతికత, అధిక ఇంధన సామర్థ్యం కలిగిన టొయోటా గ్లాంజా రూ.20,567 విలువైన 13 ప్రత్యేకమైన టిజిఎ ప్యాకేజీతో వస్తుందన్నారు. వాహనంలో ప్రీమియం క్రోమ్, బ్లాక్ బాడీ సైడ్ మౌల్డింగ్, బ్యాక్ డోర్ గార్నిష్ క్రోమ్ వంటి ప్రత్యేకమైన అంశాలు ఉన్నాయన్నారు. టయోటా గ్లాంజా అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని చెప్పారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

కోటబొమ్మాళి: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్న లత అన్నారు. కోర్టు సిబ్బందితో కలిసి కోర్టు ఆవరణం పరిశుభ్రం చేసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్ల ద్వారా వచ్చే ఆక్సిజన్ మాత్రమే కాలుష్యాన్ని నివారించ డానికి ఉపయోగ పడుతుందన్నారు. కోర్టు సూపరెంటెండెంట్ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జడ్జి ప్రసన్న



నగదు అందిస్తున్న ట్రస్టు సభ్యులు

చింతామణి ట్రస్టు సేవలు భేష్

ప్రజాశక్తి- కవిటి

పేద కుటుంబానికి చెందిన విద్యార్థుల ఉన్నత చదువులకు చింతామణి ట్రస్టు (చింతామణి కుమార్ - ఇందిరాదేవి ఆర్థిక సహాయంతో) అందిస్తున్న సేవలు అమోఘమని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు కొనియాడారు. కవిటికి చెందిన నర్సిపురం అవినాష్ ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం ఫీజుల నిమిత్తం విద్యార్థి తల్లి సత్యవతికి ట్రస్టు సభ్యులు శనివారం రూ.50 వేలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆర్థిక సమస్యలతో చదువులకు దూరం కాకూడదనే లక్ష్యంతో చింతామణి ట్రస్టు అందిస్తున్న సహకారం శ్లాఘనీయమని అన్నారు. కార్యక్రమంలో బెందాళం రమేష్, పాండవ చంద్రశేఖర్, అరిగి మధు, బెందాళం వెంకటేశ్వరరావు, పొట్లాయి లక్ష్మణమూర్తి, అరిగి త్రివిక్రమరావు, బెందాళం కామరాజు, పొట్లాయి ఉమామహేష్, బావన రవి, మొగిలిపురి సీతారాం, మొర్రి గోపి, మొగిలిపురి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



అల్పాహారం ప్యాకెట్లను అందిస్తున్న జోగినాయుడు

జిల్ ఫౌండేషన్ సేవలు ఆదర్శం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్ ఫౌండేషన్ సేవలు అందరికీ ఆదర్శం కావాలని ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శాఖ.జోగి నాయుడు అన్నారు. స్థానిక గొంటివీధిలో పట్టణ పేదల నిరాశ్రయుల భవనం (నైట్‌షెల్టర్) లో జిల్ ఫౌండేషన్ జాడ సాయి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పేదలకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ జిల్ ఫౌండేషన్ సత్యసాయి, జాడ సాయి ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, వేసవిలో వీరు చేసిన సేవలు అమూల్యమన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలతో ముందుకు సాగాలన్నారు. జిల్ ఫౌండేషన్ సత్యసాయి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జాడ సాయి జన్మదినాన ఆకలితో ఉన్న పేదలకు అన్నదానం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్ ఫౌండేషన్ సభ్యులు, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమా శంకర్, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి- కొత్తూరు

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హిరమండలం సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ లిటరసీ కౌన్సిలర్లు హేమలత, వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని సిరుసువాడలో సర్పంచ్ వలురౌతు పోలినాయుడు అధ్యక్షతన యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యాన హిరమండలం మండలం ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం కౌన్సిలర్ల నేతృత్వంలో శనివారం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజు రోజుకూ దేశంలో సైబర్ నేరాలు ఎక్కువ అవతున్నాయని వివరించారు. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వాలు, వివిధ శాఖల అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వస్తేనే ఆర్థిక నేరాలను నియంత్రించగలమన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ఆంధ్రా బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సేవా సంస్థ మారుమూల గ్రామాల్లో ఇటువంటి చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పట్ట మోహనరావు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న దుర్గారావు

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

పాతపట్నం : స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలను ఆర్ఐఒ పి.దుర్గారావు శనివారం సందర్శించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతిఒక్క విద్యార్థీ లక్ష్యాన్ని పెట్టుకుని ఆ లక్ష్యం వైపు పయనించాలన్నారు. లక్ష్యం చేరుకునే దిశలో అనేక ఇబ్బందులు వచ్చినా వెనుకకు వెళ్లకుండా ముందుకెళ్లి విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.అర్చన, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఐసిడిఎస్ పిఒ సిహెచ్ ఝాన్సీరామ్ సందర్శించారు. గ్రామంలో పెద్దింటి రాజేశ్వరి ఎటిఎం మోడల్, జి.రమణమ్మ, జి.జ్యోతి సూర్య మండల నమూనాలను శనివారం పరిశీలించారు. వాటి ఉపయోగాలను ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిల్లో ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలను ఉపయోగించి పండించిన ఆకుకూరలు, కూరగాయలును తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. రణస్థలం మండలంలో 14, లావేరు మండలంలో నాలుగు అంగన్వాడీ కేంద్రాల్లో మొదట విడతగా ప్రకృతి వ్యవసాయం నిర్వహిస్తామని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ గ్రామ కార్యకర్తలు కె. లక్ష్మి, జి. జ్యోతి, జి. రమణమ్మ, రైతులు పాల్గొన్నారు.



పంటలు పరిశీలిస్తున్న ఐసిడిఎస్ పిఒ ఝాన్సీరామ్

పల్లెపండగతో గ్రామస్వరాజ్యం సాధ్యం



పోలాకి : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

కోటబొమ్మాళి: పల్లెపండగతో గ్రామ స్వరాజ్యం సాధ్యమని మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మండల టిడిపి అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలం మంచాలపేట, చిన్నసాన, కొత్తపల్లి, సరియాపల్లి, దంత, కురుడు, మెండపేట గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో నిర్మాణం చేపట్టనున్న సిసిరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె. ఫణీంద్ర కుమార్, మాజీ ఎంపిపిలు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, మాజీ జెడ్‌పిటిసి నంబాళ శ్రీనివాస్, ఎంపిటిసి పట్ట సింహాచలం, టిడిపి నాయకులు కల్లి లక్ష్మణరెడ్డి, కల్లి నాగయ్యరెడ్డి పాల్గొన్నారు.



కవిటి : శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు

ఆమదాలవలస : మండలంలోని కణుగులవలసలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా రూ.కోటి నిధులతో నిర్మించనున్న సిసి రహదారి, కాలువ పనులకు టిడిపి మండల అధ్యక్షుడు, సర్పంచ్ నూక రాజు శంకుస్థాపన చేశారు. నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని అప్పాపురం గ్రామంలో పల్లెపండగ వారోత్సవాలు సందర్భంగా మాజీ సర్పంచ్, తెలుగు యువత మండల అధ్యక్షుడు గంట్యాడ మహేష్ సిసి రోడ్డు, కాలువ పనులకు భూమిపూజ చేశారు. అలాగే వెంకటాపురంలో మాజీ సర్పంచ్ శంబాన సూర్యనారాయణ అధ్యర్యంలో సిసి రోడ్లు, కాలువలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో శంబాన రమేష్, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండలం పిల్లలవలసలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సిసి రహదారులు, కాలువల నిర్మాణానికి సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మీసాల మన్మధరావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి సింహాచలం, ఎపిఒ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలాకి : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మబగాంలోని మొయ్యిల వీధిలో సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శంకుస్థాపన చేశారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలోని తెంబూరు, పెద్దలక్ష్మీపురం పంచాయతీల్లో డ్రెయినేజీలు, సిసి రోడ్ల నిర్మాణాలకు టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు శైలాడ సతీష్, పెద్ద లక్ష్మీ పురం సర్పంచ్ అన్యపు ఉమామహేశ్వరరావు, ఎంజిఆర్ యువసేన అధ్యక్షులు రాంప్రసాద్, తెంబూరు మాజీ సర్పంచ్ సింహాచలం, విఆర్‌ఒ, కార్యదర్శి పాల్గొన్నారు.

కవిటి: అభివృద్ధి కార్యక్రమాల జోరుతో పల్లెల్లో పండగ వాతావరణం ఏర్పడిందని టిడిపి నాయకులు మణిచంద్ర ప్రకాష్, బెందాళం రమేష్ అన్నారు. మండలంలోని కుసుంపురంలో శనివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో రూ.25 లక్షల అంచనా వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సీపాన వెంకటరమణ, పొందల కృష్ణారావు, కొర్రాయి వాసుదేవ్, వజ్జ గోపి, బార్ల చినబాబు, అంగ సురేష్ పాల్గొన్నారు.



పొందూరు : శంకుస్థాపన చేస్తున్న నాయకులు



కోటబొమ్మాళి : శంకుస్థాపన చేస్తున్న టిడిపి నాయకులు



ఆమదాలవలస : శంకుస్థాపన చేస్తున్న రాజు

కొత్తూరు: పల్లె పండగలో భాగంగా కొత్తూరు, బలద, కడుము, కౌసల్యపురం గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాద్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నీరజ, సర్పంచ్ కృష్ణవేణి, టిడిపి నాయకులు టి.తిరుపతిరావు, కె.సంజీవరావు, ఎం.కృష్ణ, సిహెచ్.రాము, జోగినాయుడు, పి.అమర్, జనార్ధన్, గణేష్ పాల్గొన్నారు.



లావేరు : భూమి పూజ చేస్తున్న మహేష్ తదితరులు

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న వాకర్స్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వాక్ ఫర్ ఫ్రీడమ్ నిశ్శబ్ద నడక కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్ట్స్ కళాశాల నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ ఎన్‌జిఒ ఆస్ట్రేలియా ఏ 21, ది మూమెంట్ ఇండియా ముంబై వారి సహకారంతో గ్రామ జ్యోతి సొసైటీ, స్టార్ వాకర్స్ క్లబ్, రోజస్ సంస్థ, ఇంటర్నేషనల్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన జరిగిన ఈ ర్యాలీలో వక్తలు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా జీవితాలను నాశనం చేస్తుందని, స్వేచ్ఛకు అంతిమ గెలుపు ఉంటుందన్నారు. 21 శతాబ్దంలో కూడా బానిసత్వం కొనసాగుతోందని, అందులో భాగంగా వ్యక్తులు వస్తువులుగా విక్రయించ బడుతున్నారని, అందులో చిన్న పిల్లలను సైతం విక్రయిస్తున్నారన్నారు. అటువంటి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. ప్రధానంగా లైంగిక దోపిడీకి మహిళలు, బాలికలు, చిన్నారులే బలవుతున్నారన్నారు. ఉమెన్ ట్రాఫి కింగ్‌కు గురైన వారు హెల్ప్‌లైన్ నెంబర్లను 1098, 181 కు సంప్రదించ వచ్చన్నారు. కార్యక్రమంలో రోజస్ సంస్థ అధ్యక్షుడు జి.వి.నాగభూషణరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగి నాయుడు, గిరిజన ఆశ్రమ పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు వాసుదేవరావు, బి.వి. రవి శంకర్. జి.లక్ష్మీ, గుడ్ల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అవసరం



శ్రీకాకుళం రూరల్: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.లక్ష్మి అన్నారు. మండలం కిల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పట్టణ మహిళా పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో మహిళా భద్రత, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ హెచ్‌సి ఎన్.పార్వతి, పాఠశాల హెచ్‌ఎం శశికళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: మైనర్లు వాహనం నడపడం చట్టరీత్యా నేరమని, మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. స్థానిక సిస్టమ్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మొదలవలస మోహనరావు, ప్రిన్సిపాల్ రమణ, తదితరులు పాల్గొన్నారు.



పొందూరు : మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

పొలాల్లో పెరుగుతున్న పాముకాట్లు

ప్రజాశక్తి- పొందూరు

వ్యవసాయ పనులకు పొలాలకు వెళ్తున్న రైతులు పాముకాటుకు గురవుతుండడంతో రైతులు భయాందోళనలు చెందుతున్నారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు రెల్లిగెడ్డకు వరద ఉధృతి పెరిగి పొలాలను ముంచెత్తింది. ఈ వరదలకు పాములు కొట్టుకువచ్చి పొలాల్లోకి చేరిపోయాయి. ఇటీవల మండలంలోని లైదాం గ్రామం సమీపంలో పొలం పనులకు వెళ్తున్న రైతులు, కూలీలు ఇటీవల పాముకాట్లుకు గురవుతుండడంతో తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన జి.పార్వతమ్మ పాముకాటుకు గురికాగా కుటుంబ సభ్యులు సకాలంలో స్పందించి ఆస్పత్రికి తరలించారు. సకాలంలో చికిత్స అందడంతో ప్రాణాప్రాయం తప్పింది. అలాగే రెండు రోజులు క్రితం ఇదే గ్రామానికి చెందిన కెంబూరి ఆదిలక్ష్మి అనే మహిళ పొలంలో పనిచేస్తుండగా పాముకాటు వేసింది. దీంతో పరిస్థితి విషమించిడంతో కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించడంతో ప్రాణాప్రాయం నుంచి బయట పడింది. ఈ విధంగా రెండు రోజుల్లో ఇద్దరు మహిళలు పాముకాటుకు గురి కావడంతో పొలం పనులకు వెళ్లాలంటేనే రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.



పాముకాటుకు గురైన మహిళకు చికిత్స అందిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

పారదర్శకంగా సోషల్ ఆడిట్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని ఉపాధి హామీ 2023-24లో జరిగిన పనులపై సోషల్ ఆడిట్ పాదర్శకంగా నిర్వహించాలని ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్‌జిఎస్ సమన్వయ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పది రోజుల పాటు మండలంలోని వివిధ పంచాయతీల్లో సోషల్ ఆడిట్, గ్రామ సభలు నిర్వహిస్తామని అన్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు ఆడిట్ బృందానికి సహకరించి రికార్డులు అప్పగించాలని ఆదేశించారు. ఈ నెల 30న పథక సంచాలకులు ఆధ్వర్యాన మండల కేంద్రంలో ఆడిట్ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, ఉపాధి హామీ ఎపిడి స్వరూపరాణి, ఎస్ఆర్‌పి రామారావు, ఎపిఒ కేశవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు

మోహన్ ఔదార్యం



నగదు అందిస్తున్న మోహన్

కవిటి: జగతి మాజీ సర్పంచ్ గంతి దశరథి కుమారుడు గంతి మోహన్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. రక్తహీనత వ్యాధితో బాధపడుతున్న మండలంలోని బట్టివాణిపాలెంకు చెందిన చీకటి మదన్‌కు రూ.10వేలు అందించారు. అనంతరం మాట్లాడుతూ రెక్కాడితే గానీ డొక్కాడని మదన్ కుటుంబానికి దాతల సాయం అవసరమని, స్వచ్ఛంద సంస్థలు, దాతలు మధన్ వైద్యం కోసం ఉదారంగా సాయం చేయాలని కోరారు.

గద్దర్ సభను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం

గద్దర్ సభను జయప్రదం చేయాలని గద్దర్ ప్రజా చైతన్యం కోసం తన జీవితాన్నే అంకితం ఇచ్చిన మహోన్నతుడని దళిత మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రాముమాస్టరు, డి.కుసుమ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం గద్దర్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 20న విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో మధ్యాహ్నం 2గంటల నుంచి సభ జరుగుతుందని, ముఖ్య అతిథిగా గద్దర్ కుమార్తె వెన్నెల గద్దర్ హాజరవుతారన్నారు. ప్రతిఒక్కరు పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత మహాసభ నాయకులు డి.ప్రసాద్, కె.అప్పారావు, కె.తవుడు, కె.సీతారాం, ఎస్.శివకుమార్, డి. నారాయణరావు, కె.రాజయ్య, కె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న వరి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

శివారు భూములకు వంశధార నీరు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. గత ఐదేళ్లుగా వంశధార నీరు శివారు భూములకు అందకపోవడంతో పంటలు లేని పరిస్థితి ఉందని, వైసిపి పాలనలో టెక్కలి ప్రాంతంలో అనధికార లిఫ్టులు ఏర్పాటు చేయడం వలనే దిగువకు సాగునీరు రావడం లేదని సాకులు చెబుతూ వచ్చారుని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో వంశధార శివారు ప్రాంతానికి సాగునీరు వచ్చిందన్నారు.

ఇటీవల వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో వరి పంట పొట్టదశలో చెరువుల్లో నీరు అడుగంటిందని, ఇటీవల బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినా ఈ ప్రాంతానికి తగినంత వర్షపాతం నమోదు కాలేదని, అరకొరగా పడిన వర్షంతో పొలానికి తగిన స్థాయిలో నీరు చేరలేదన్నారు. పెద్దబొడ్డపాడు రామసాగరంలో సాగునీరు పూర్తిగా అడుగంటిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పొట్ట దశలో పొలం బీటలు వారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఏడాది కూడా కరువు తప్పదని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి శివారు ప్రాంతానికి వంశధార నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.



నీరులేక ఎండిపోతున్న వరి పొలాలు



విరాళాన్ని స్వీకరిస్తున్న భద్రాజీ

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి నగరానికి చెందిన బుర్ర రాంబాయ్, ఎస్.శ్రీనివాసరావు దంపతులు రూ.1,00,116 చెక్కును ఆలయ ఇఒ యర్రంశెట్టి భద్రాజీకి అందజేశారు. ఆలయాన్ని శనివారం సందర్శించిన వారు ఇఒను అనివేటి మండపంలో కలిసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ ఎ.శోభనాద్ర చార్యులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పలకలు వేసేదెప్పుడు?

ప్రజాశక్తి- పోలాకి

పారిశుధ్యం పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని అధికారులు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు ప్రకటిస్తుంటారు. కానీ, గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ బాగుచేయడంలో అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారని బాధితులు వాపో తున్నారు. ఇందుకు ఉదాహరణకు మండలంలోని వెదుళ్ల వలసలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న డ్రెయినేజీ కాలువలు అందుకు అద్దం పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెదుళ్లవలసలో గత నెల రోజులు క్రితం సుమారు రెండు వందల మీటర్ల పొడవున మురుగు కాలువపై పలకులు తీసి వదిలేశారు. కాలువలు శుభ్రపరిచి మరమ్మతులు చేపడతామని చెప్పి కాలువలపైన పలకలు తొలగించారు. దీంతో డ్రెయినేజీకి ఆనించి ఉన్న కుటుంబాలు నానా రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావడానికి ఇబ్బందిగా ఉంటుంది. రాత్రి సమయంలో బయిటకు రావడానికి కాలువపై అడ్డుగా కర్రలు కట్టుకొని వస్తున్నారు. పొరపాటున కాలు జారితే కాలో, చెయ్యి విరిగే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. అలాగే మురుగు కాలువపై పలకులు లేకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని స్థానికులు వెంకట రమణ, గోవిందరావు, మల్లేసు, వెంకటరావు, రామకృష్ణ వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మురుగు కాలువ మరమ్మతులు చేపట్టి పలకలు వేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఇఒపిఆర్‌డి పద్మావతిని వివరణ కోరగా... డ్రెయినేజీ ఎత్తు చేసి పలకలు వేయాల్సి ఉందన్నారు. ఆ పనులకు నిధులు కూడా మంజూరయని తెలిపారు. వారం రోజుల్లో పనులు పూర్తిస్తామని అన్నారు.



పలకలు తొలగించడంతో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

ఇద్దరు అరెస్టు

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ పట్టణం గుసాని సమితి ఉప్పలాడ పంచాయతీరాజ్ సీతాపూర్, పాటికోట గ్రామాల్లో గత నాలుగు రోజులుగా జరిగిన దొంగతనాలకు సంబంధించి అనుమానితులుగా భావించిన ఇరువురు మహి ళలను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు గురండి ఠానా ఇన్‌స్పెక్టర్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ బెహరా శనివా రం తెలిపారు. పట్టుబడిన అనుమానితులను ప్రశ్నిం చగా, కాశీనగర్‌లోను వేరే చోట్ల చోరీలకు పాల్పడినట్లు పేర్కొన్నారు.

